నినాదం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం 04 అక్టోబర్ 2024
తెలంగాణ ప్రాంతీయం



## ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

**కరీంనగర్, అక్టోబర్ 3(నినాదం న్యూస్)**
కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలచే అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, గౌరమ్మలను తయారుచేసి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆటలు ఆడారు. కళాశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. దేవతలను పూలతో పూజిస్తారని అదే పూలను దేవతలుగా పూజించే గొప్ప సంస్కృతి మనది అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మన పండుగలకు ప్రత్యేక గుర్తింపు ఉందని పలు దేశాల్లో మన సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తూ ఉత్సాహంగా పాల్గొంటున్నారని, మన పండుగల యొక్క విశిష్టతను తెలిపేందుకు విద్యార్థుల్లో నూతన తేజాన్ని నింపేందుకు విద్యాసంస్థల్లో బతుకమ్మ ఉత్సవాల నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ బతుకమ్మ పండుగ అని తొమ్మిది రోజులపాటు ఆధ్యాత్మికతతో ప్రత్యేక వాతావరణాన్ని కల్పిస్తారని తెలిపారు. అంతకుముందు సాంప్రదాయాలను పాటిస్తూ జ్యోతి ప్రజ్వలన చేసి దుర్గామాతకు పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు అత్యంత భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కలిసిన మహితపూర్ రైతులు



**జగిత్యాల, అక్టోబర్ 3 (నినాదం న్యూస్)**
రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో దాదాపు 200 మంది పైడుమడుగు ఇండియన్ బ్యాంకులో రుణాలు పొందారని ఈ బ్యాంకులో మెజారిటీ శాతం రైతులకు రుణమాఫీ అమలు కాలేదని, రుణమాఫీ అమలు చేసే విధంగా కృషి చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే జగిత్యాల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి సమస్య తెలుసుకొని, ప్రభుత్వం దృష్టికి వ్యవసాయ శాఖ మంత్రి, ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి 100 శాతం రుణమాఫీ అమలుకు కృషి చేస్తానని అన్నారు. మాజీ ఏయంసి ఛైర్మెన్ గన్నె రాజీరెడ్డి, రఘుపతి రెడ్డి,గంప ఆనంద్, సుధాకర్ పాల్గొన్నారు.

# మంత్రి కొండాపై దుష్ప్రచారం దారుణం

- కారకులను కఠినంగా శిక్షించాలి
- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కర్ర సత్య ప్రసన్నా రెడ్డి




**కరీంనగర్, అక్టోబర్ 3(నినాదం న్యూస్ )**
సోషల్ మీడియాలో రాష్ట్ర మహిళా మంత్రి కొండా సురేఖపై అసభ్యకరంగా ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ విధానాలను ఖండిస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పిలుపుమేరకు నగరంలోని ఇందిరా చౌక్లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కర్ర సత్య ప్రసన్నా రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కర్ర సత్య ప్రసన్నా రెడ్డి మాట్లాడుతూ మహిళా మంత్రి కొండా సురేఖని కించపరిచే విధంగా సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్న వారిని ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాము అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ కాలంలో మంచి విషయాలను సమాజానికి చేరవేయడానికి కాకుండా టిఆర్ఎస్ వారు ఈ విధమైన అభ్యంతరంగా చర్యలు చేపట్టడం విచారకరం అన్నారు. ఇంత జరుగుతున్న బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గానీ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కానీ స్పందించకపోవడం ఆ పార్టీకి చెందిన సోషల్ మీడియా సభ్యులను హెచ్చరించకపోవడం వెనుక వారి ప్రమేయం ఉన్నదని భావించవలసి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సమచిత స్థానాన్ని కల్పిస్తూ మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఉచిత బస్సును ఏర్పాటు చేయడం పట్ల మాలాంటి ఎంతో మంది మహిళలు గౌరవంగా బస్సు ప్రయాణం చేయడం , కొంతమంది రోజువారి కూలీ పనులకు వెళ్లే మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించడం జరిగిందన్నారు.
ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుశీల, భారతమ్మ, జిల్లా కార్యవర్గం కవిత, లావణ్య, రజిత రెడ్డి, హసీనా, సత్య, అంజలి, స్వప్న, హుజూరాబాద్ టౌన్ అధ్యక్షులు పుష్పలత,మండల అధ్యక్షులు, లత, సుజాత, ధర్నా కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత , జిల్లా ఉపాధ్యక్షురాలు సొల్లు సునీత, బ్లాక్ అధ్యక్షురాలు సుశీల,మండల అధ్యక్షురాలు లావణ్య, రాధ, రేణుక, స్వరూప, స్వప్న, మంజుల, లావణ్య, స్వప్న, లత, కవిత తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

- రూ. 8 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం
- కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్

**జవహర్ నగర్, అక్టోబర్ 3:నినాదం న్యూస్**
డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ లోని 21వ డివిజన్ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 8 లక్షలతో కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేయర్ శాంతి కోటేష్ గౌడ్ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ సమక్షంలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ప్రేమల శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్ అంతాటా మంచినీటి నల్లా కనెక్షన్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు. కార్పొరేషన్‌లో 21వ డివిజన్‌ను అభివృద్ధిలో ముందంజలో ఉంచుతా నని పేర్కొన్నారు. కో ఆప్షన్ సభ్యులు భూమా విజయ పాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండ్ల నరేష్, కే రవి, ఒంటెద్దు వెంకటేష్, గడిపే సునీల్ కుమార్, సాంబయ్య, డివిజన్ నాయకులు మహమ్మద్ ఉమర్, ఓబుల్ రెడ్డి, రూబెన్, దుర్గయ్య, మాజీ వార్డ్ మెంబర్ వాహబ్, యాకూబ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



## కొండా సురేఖ క్షమాపణ చెప్పాలి

- మానకొండూర్ నియోజవర్గం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఎలా శేఖర్ బాబు

**కరీంనగర్, అక్టోబర్ 3(నినాదం న్యూస్)**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మానకొండ సోషల్ మీడియా ఇంచార్జి ఎల శేఖర్ బాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాజకీయ వాదనల్లో పసలేకే వ్యక్తిగత దూషణలకు దిగజా రుతున్నారని, హీరో నాగచైతన్య విడాకులకు కేటీఆరే కారణమని, హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటు చేసిందే కేటీఆర్ అని ఆమె ఆరోపించడం తగదన్నారు. ఇలాంటి చౌకబారు



ఆరోపణలు చేస్తే సహించేది లేదని, రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకే ఇలా మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనం అని వెంటనే క్షమాపణలు తెలపాలని కోరారు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు

## - త్రిపుర సుందరి దేవిగా అలంకారం



**అల్వాల్, అక్టోబర్ 3 (నినాదం న్యూస్)**
దేవి నవరాత్రుల సందర్భంగామచ్చ బొల్లారంలోని ఏడు గుళ్ళు అమ్మవారికి ఆలయ నిర్వహకులు శ్రావణ్ ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవి శరన్నవరాత్రులు మొదటి రోజు త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు భక్తులు ఉదయం నుండే దర్శనం చేసుకున్నారు.

# డ్రగ్ రహిత సమాజమే సందేశంగా క్రికెట్ టోర్నీ



**వెల్గటూర్,అక్టోబర్03(నినాదం న్యూస్):**
నేటి ఆధునిక కాలంలో డ్రగ్స్ కి బానిస కాకుండా డ్రగ్ రహిత సమాజం కోసం,యువత డ్రగ్స్ పట్ల ఆకర్షితులు కావద్దనే మంచి సందేశంతో వెల్గటూర్ మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. మండల కేంద్రంలో బుధవారం నుండి ఉమ్మడి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు కాంపెల్లి సాయి,లకుమళ్ళ సాయి, తరాళ్ళ నవీన్,ముగల సంతోష్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, నాయకులు మురళి ప్రారంభించారు. టోర్నీలో విజేతలకు కాంగ్రెస్ నాయకులు గాజుల రవి,మల్లేశం,నిర్వహణలో బండారి రాజేందర్, కుషన పల్లి రాజేశంలు ఇతర సహాయం అందించారు. క్రీడలు యువతకు మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకు దోహద పడతాయని నాయకులు పేర్కొన్నారు. డ్రగ్ రహిత సమాజం కోసం టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యువకునికి సన్మానం

**వెల్గటూర్,అక్టోబర్03(నినాదం న్యూస్):**
ఇటీవలే వెలువడిన డిఎస్సీ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కొలువు సాధించిన కొత్తపేట గ్రామానికి చెందిన యువకుడు కుశనపల్లి పల్లి ప్రసాద్‌ను స్థానిక నాయకులు జిరెడ్డి మహేందర్ రెడ్డి సన్మానించారు. డిఎస్సీ ఫలితాలలో కొత్తపేట గ్రామానికి చెందిన కుషణపల్లి పోచయ్య చంద్రయ్య ల కుమారుడు కుషనపల్లి ప్రసాద్ జగిత్యాల జిల్లా స్థాయిలో ఎస్జీటీలో 102,ఎస్సీ కోటాలో 12 వ ర్యాంక్ సాధించి టీచర్ పోస్ట్‌కు ఎంపికయ్యాడు. పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ కొలువు సాధించడం పట్ల గ్రామస్తులు,నాయకులు జిరెడ్డీ మహేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేసి చిరు సన్మానం చేశారు.కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# సర్వే సరిగ్గా చేయాలి

## - వివరాలు అన్నీ నమోదు కావాలి
## - మెదక్ మున్సిపల్ పరిధిలో సర్వే తీరును పరిశీలించిన నోడల్ అధికారి ఆర్డీవో రమాదేవి

**మెదక్ ప్రతినిధి అక్టోబర్ 3 (నినాదం న్యూస్ )**
అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జరుగుతున్న సర్వే పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి ఆర్డీవో రమాదేవి తెలిపారు. గురువారం మెదక్ మున్సిపల్ పరిధిలో ఎంపిక చేసిన కుటుంబాలలో 7వ తేదీ వరకు జరిగే డిజిటల్ కార్డు జారీ ప్రక్రియకి సంబంధించిన సర్వేను గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్డిఓ రమాదేవి పరిశీలించారు. ఈ సందర ్భంగా ఆర్డీవో రమాదేవి సర్వే చేస్తున్న అధికారులతో మాట్లాడుతూ... కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేరు, జెండర్, పుట్టిన తేదీ, వయసు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ తదితర వివరాలన్నీ పక్కాగా... ఏ ఒక్కటి మిస్ కాకుండా నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు కనీసం 50 కుటుంబాలలో సర్వే అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకి నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి కావాలన్నారు . ఈ సందర్భంగా...సర్వే చేస్తున్న బృందాల వారికి తగు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సంబంధిత తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి సైన్స్ నాటక పోటీలకు పారమిత విద్యార్థి బృందం

**కరీంనగర్, అక్టోబర్ 3(నినాదం న్యూస్)**
సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ కోసం కరీంనగర్ జిల్లా జిల్లా విధ్యాశాఖ వారి ఆద్వర్యంలో నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీలలో భాగంగా స్థానిక నగరంలోని మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని హైదరబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే గత రెండు సంవత్సరాలుగా నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్న బృందం పారమిత పాఠశాల అని ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలోని ఫిలిమ్ భవన్ వేదికగా సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఇట్టి పోటీలో స్వయం కృతాపం అనే పేరుతో ఆధునికత మరియు అభివృద్ధి అనే పేరుతో ప్రకృతిని వినాశనం చేసి అనారోగ్య సమస్యల విలయంలో ఏ విధంగా కొట్టు మిట్టాడుతున్నాడు అనే అంశాన్నిచక్కని అభినయ రూపంలో కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. ఇట్టి పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాల విద్యార్థులచే నాటక ప్రదర్శనలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 23 బృందాలు పాల్గొనగా పారమిత పాఠశాల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాదించిందిన ఇట్టి విద్యార్థి బృందంను జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందివారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పారమిత పాఠశాల అధినేత డా.ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్ హనుమంతరావు, ప్రధానో పాధ్యాయులు బాలాజి, నాటక బృందం పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి నాటక ప్రదర్శనలో పాల్గొననున్న విద్యార్థులను డైరెక్టర్లు, ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేష్ వినోదరావు, వియుఎం.ప్రసాద్, టి. యస్వి రమణ, ప్రధానోపాధ్యాయులు, సమన్వయ కర్తలు ఉపాధ్యాయులు అభినందించారు.



# దేవీ నవరాత్రులు షురూ

## - రామగుండం కమిషనరేట్ పరిధిలో 566 విగ్రహాలు ఏర్పాటు



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 03 ( నినాదం)**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాలను ఊరేగించి మండపాల్లో ప్రతిష్టించారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల నిరంతర భజనలు కొనసాగిస్తున్నారు. కాగా పలుచోట్ల అమ్మవారి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో 566 దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్టించినట్లు పోలీసులు గుర్తించారు.

**ప్రశాంతంగా నవరాత్రి ఉత్సవాలు**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలకు తెలిపారు. మండపాల నిర్వాహకులకు సమాచారం పోలీస్ స్టేషన్లో ఇవ్వాలని కోరారు. ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. మండపాల వద్ద విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా దుర్గామాత నవరాత్రులు, నిమజ్జనం జరుపుకోవాలని సీపీ సూచించారు.